క్లుప్తంగా

విద్యా సామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలపై ప్రశ్నిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో భాగంగా ఎంఈఓ జగదీశ్వరరావు విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. లెసెన్ ప్లాన్, విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరు, మధ్యాహ్న భోజనం మెనూ అమలు నిర్వహణ నాణ్యత రుచిపై ఆరా తీసారు. వారంలో మూడు పర్యాయాలు మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని సూచించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



పోరలి కూడలి వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

దత్తిరాజేరు: దొంగతనాల నియంత్రణకు మండలంలోని నాలుగు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు పెదమానాపురం ఎస్ఐ జయంతి సోమవారం తెలిపారు. పోరలి, గడసాం, దత్తిరాజేరు, ఇంగిలాపల్లి గ్రామాల్లో కూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటి ద్వారా దొంగతనాలు, ప్రమాదాల సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు.

మాలల ఆశాజ్యోతి పీవీ రావు



పీవీ రావుకు నివాళులర్పిస్తున్న మాల మహానాడు నేతలు

గుర్ల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి మాల జాతి హక్కులు కాపాడిన మహోన్నత వ్యక్తి పీవీ రావు అని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీ రావు వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆయనను ఆదర్శంగా తీసుకొని పోరాటం చేస్తామన్నారు. పీవీ రావుకు నివాళులర్పించిన వారిలో జిల్లా రెల్లి సంఘం అధ్యక్షురాలు నీలాపు దేవి, సబ్బి సోనియా, భీమరాజు, చంటి ఉన్నారు.

క్షయపై అవగాహన అవసరం



రాచకిండాంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

బొండపల్లి: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాచకిండాం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రోజుల తరబడి దగ్గు వస్తుంటే సమీపంలో గల ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజరు జి.రాము, గ్రామ సర్పంచ్ చొక్కాకు ఈశ్వరమ్మ, హెచ్‌వి.రాధాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ షర్మిల, ఏఎన్ఎం ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నకుమార్

గజపతినగరం: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.రత్నకుమార్ అన్నారు. గజపతినగరం గ్రామ సచివాలయం 2 పరిధిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సులో రీసర్వే డీట జోగినాయుడు, ఆర్ఐ కె.అప్పలరాజు, సర్పంచ్ నరవ కొండమ్మ, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారులకు.. మోక్షమెప్పుడో..!

- గర్భాం, గరివిడి మార్గంలో అడుగుకో గుంత
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



గర్భాం పెట్రోల్ బంకు వద్ద ఏర్పడ్డ గోతులు



గర్భాం - గరివిడి ప్రధాన రహదారిలో వీపీ రేగ రైస్ మిల్లు ఎదురుగా ఏర్పడ్డ గోతులు

మెరకముడిదాం: మండలంలో ప్రధానమైన పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంతతో దర్శనమిస్తూ వాహనచోదకులను భయపెడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. గర్భాం నుంచి గరివిడి 15 కిలోమీటర్ల మార్గంలో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే ఈ మార్గంలో అడుగుకో గొయ్యి ఏర్పడి మొత్తం గోతులమయమైంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే మరోవైపు 11 కిలోమీటర్ల పొడవునా ఉన్న గర్భాం జంక్షన్ నుంచి ఉత్తరావల్లి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. చివరకు చినుకు పడితే పాదచారులు సైతం ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రివేళల్లో ఈ మార్గాల్లో ప్రయాణమంటే హడలిపోతున్నారు. వర్షం పడితే నిలువెత్తు గోతులు కనిపించక వాహనాలు దిగబడి ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎన్నికల వేళ రహదారుల మరమ్మతులు, కొత్తగా వేస్తామని చెప్పిన ఉపన్యాసాలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు కిమ్మనకుండా ఉన్నారు. దీంతో కూటమి నేతల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన రహదారుల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకోక ముందే ఈ మార్గాలను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బిందు - తుంపర సేద్యంతో లాభాలు



బిందు తుంపర సేద్యం యూనిట్లపై వివరిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

వేపాడ: నీటి వనరు ఉన్న ప్రతీ రైతు బిందు తుంపర సేద్యం యూనిట్‌ను సద్వినియోగం చేసుకుని 90 శాతం రాయితీ యూనిట్ పొందాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టరు పిఎస్‌వి.లక్ష్మీ నారాయణ అన్నారు. వేపాడలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరు, మోటారు లేదా బావి నీటి ఇంజన్ వున్న ప్రతీ రైతు బిందు తుంపర సేద్యానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది సెంట్లు వున్న రైతు నీటి వనరు వుంటే బిందు సేద్యానికి అర్హులేనన్నారు. ఎకరాకు మించి ఐదు ఎకరాల్లోపు వున్న రైతులు తుంపర సేద్యం యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జిల్లాలో 100 హెక్టార్లు బిందు, తుంపర సేద్యం లక్ష్యం కాగా 11.07హెక్టార్లకు యూనిట్లు మంజూరు చేసామన్నారు. నీటి వనరులున్న ప్రతీ రైతు బిందు తుంపర సేద్యం యూనిట్‌కు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎంపీఏలను సంప్రదించాలని సూచించారు.

1729 ఆకారంలో అలరించిన విద్యార్థులు



1729 ఆకారంలో రామానుజమ్‌కు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా వేపాడ మండలం సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 1729 అంకెల ఆకారంలో కూర్చొని సోమవారం అలరించారు. హెచ్ఎం బీపీఏ రాజు, ఉపాధ్యాయులు, ఎంఈఓ శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– వేపాడ

దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

లక్కవరపుకోట: దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి అందరికీ అనుకూలమైన ధర్మాచార్యులకు అప్పజెప్పాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ సీహెచ్ నర్సయ్య కోరారు. దీనికి మద్దతుగా జనవరి 5న విజయవాడలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల కేంద్రానికి సోమవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవాలయాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం ఇతర రంగాల్లో ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రత్యేక రైళ్లు వేసినట్టు తెలిపారు. అంతకు ముందు హైందవ శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఖండ సహ సంయోజక్ కె.అప్పారావు, బి.వెంకటేశ్వరరావు, ఎం. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఎవరూ వీడలేదు..: జెడ్పీటీసీ

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి జనసేన పార్టీలో ఒక్కరూ కూడా చేరలేదని జనసేనలోని చేరిన వారితో పార్టీకి ఎటువంటి సబంంధం లేదని జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం దేవుపల్లి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ వారు పార్టీ మారినట్టు కొన్ని మాధ్యమాల్లో వచ్చిన వార్తలు వాస్తవం కాదని పేర్కొన్నారు. జనసేలో చేరిన నాయకులకు తమ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. దేవుపల్లిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని పేర్కొన్నారు.

గీత కార్మికులను మోసం చేసిన కూటమి సర్కార్



డీటీ శోభారాణికి వినతిపత్రం అందజేస్తున్న అప్పారావు

గజపతినగరం: కల్లు గీత కార్మికులను కూటమి సర్కార్ మోసం చేసిందని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పురం అప్పారావు అన్నారు. మండలంలోని పురిటిపెంట సంతతోటలో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ద్వారా అనుమతులు మంజూరయ్యేలా చూడాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ శోభారాణి, ఎస్ఐ కె.లక్ష్మణరావుకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. సంతతోటలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు 14 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం, పెళ్లికానుక, కల్లుగీత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సాయం తదితర ఏ ఒక్క దాన్ని అమలు చేయలేదని ఆయన విమర్శించారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేని ఎరువులు
- అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేటు డీలర్లు



చీపురుపల్లి నుంచి యూరియా బస్తాలను బైక్‌పై తీసుకువెళ్తున్న గర్భాంకు చెందిన రైతు

మెరకముడిదాం: రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఎరువుల బస్తాలను అధిక ధరలకు ప్రైవేటు డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు ప్రభుత్వం నుంచి లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చేసేది లేక ప్రైవేటు డీలర్లను రైతులు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు యూరియా బస్తాపై కనీసం రూ.60లు అధికంగా వేసి అమ్మకలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసి రైతుభరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను, పురుగు మందులను సీజనల్ వారీగా అందుబాటులో ఉంచేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం లేదు. దీంతో ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలానికి చెందిన కొందరు రైతులు చీపురుపల్లిలో ఉన్న గ్రోమోర్ కేంద్రాల నుంచి బస్తా యూరియా రూ.270లకు విక్రయిస్తుండగా, కొందరు రైతులు గర్భాంలో ఓ ప్రైవేటు డీలరు నుంచి రూ.60 నుంచి 70లు ఎక్కువ చెల్లించి యూరియా బస్తాను తెచ్చుకుంటున్నారు. ఇలా రైతులకు సకాలంలో రైతులను అందజేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని చెబుతున్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి



పౌర సరఫరాల శాఖ డీటీకి వినతిపత్రం అందజేస్తున్న రాములు

గజపతినగరం: పురిటిపెంట రెవెన్యూ పరిధిలో తుఫాన్ వర్షాలకు నష్టపోయిన వరి, అపరాలు, ఉద్యానవన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండు చేశారు. పురిటిపెంట గ్రామంలోని పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు పురిటిపెంట, సుబ్బసాగరం, వంక చెరువు, ముద్దూరు చెరువు, కచ్చ చెరువుల కింద వరి పంటతో పాటు, అపరాలు, ఉద్యానవన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతీ ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం చెల్లించినట్లయితే రైతుభరోసా ఇచ్చినట్లవుతుందని అన్నారు. అనంతరం ఆయన పౌర సరఫరాల శాఖ డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ నారాయణరావు, రైతు సంఘం మండల కన్వీనర్ దాసరి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

• క్షయ వ్యాధిపై అవగాహన



క్షయ వ్యాధిపై వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ మీరాకుమారి వేపాడ మండలం వల్లంపూడి గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. 100 రోజుల క్షయ వ్యాధి ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి లక్షణాలున్న వారికి కఫం పరీక్షలు నిర్వహించారు. డీఎల్ఏటీఓ డాక్టర్ రాణి, డాక్టర్ పూర్ణేంద్రబాబు, డాక్టర్ ప్రశాంత్, వైద్యాధికారిణి ధరణి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ రుద్ర అంజలిదేవి క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లు అందజేశారు. – వేపాడ

• లింగ వివక్షపై కొవ్వొత్తుల ర్యాలీ



లింగ వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు లింగ వివక్షకు వ్యతిరేకంగా పట్టణంలోని విజయా కాలనీలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ లింగ వివక్షకు వ్యతిరేకంగా లింగ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు నిర్మాణాత్మకమైన వ్యూహాలు అమలు చేసేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. లింగ వివక్ష చట్టరీత్యా నేరమన్నారు. సీసీ గోవింద్, వీఓఏ కుమారి తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

• ఆకట్టుకున్న చిన్నారులు



బొండపల్లి మండలంలోని బోడసింగిపేట గ్రామంలో ఆర్‌సీఎం స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నారులు వేషధారణలతో సోమవారం ఆకట్టుకున్నారు. క్రీస్తు జీవితానికి సంబంధించిన వేషధారణలు ధరించి అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ శాంతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. – బొండపల్లి

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి, వి.కృష్ణాపురం గ్రామాలలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేస్తున్నామని తెలిపారు. సిబ్బందితో క్షేత్ర స్థాయి లో దర్యాప్తు చేయించి రైతుల భూములకు సంబంధించిన సరిహద్దులు, వారసత్వ భూములు తదితర సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోకులాల షెడ్ల మంజూరుపై సభ్యుల ధ్వజం

- 433 దరఖాస్తులు.. మంజూరైనవి 25
- ఏ ప్రాతిపదికన మంజూరు చేశారంటూ ధ్వజం
- అధికారులను నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: గోకులాల షెడ్లు ఏ ప్రాతిపదికన మంజూరు చేశారంటూ మండల సమావేశంలో సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో గోకులాల షెడ్ల మంజూరుపై ఉపాధి ఏపీఓ ఆదిలక్ష్మి, పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ వివరిస్తుండగా సభ్యులు నిరుజోగి వెంకటరావు, నౌడు అరుణ, మురిపిండి గంగరాజు తదితరులు ప్రశ్నించారు. గోకులాల షెడ్ల జాబితా సర్పంచ్‌లకు ఇవ్వలేదని, వన్ బీ ఉంటే దరఖాస్తు చేసుకోమన్నారని.. మంజూరైన వారు అదే నంబర్‌లో షెడ్లు నిర్మిస్తున్నారా? అంటూ ధ్వజమెత్తారు. దీనిపై స్పందించిన అధికారులు గ్రామసభలో వచ్చిన 433 దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించామని మొదటి దఫాలో 25 మంజూరైనట్టు చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న గోకులాల షెడ్లకు జియో ట్యాగింగ్ చేసాకే నిర్మాణం ప్రారంభించాల్సి ఉందన్నారు. మంజూరైన వాటికి వ్యక్తిగత తీర్మానాలు ఇవ్వాలని అడుగుతున్నారని ప్రశ్నించగా అటువంటి తీర్మానాలు అడగలేదని అధికారులు చెప్పారు. ఇప్పటికీ ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెప్పడంతో సభ్యులు శాంతించారు. ధాన్యం కొనుగోలులో దళారీలదే రాజ్యంగా ఉందని సభ్యులు ప్రశ్నించారు. రైతులు నేరుగా సంబంధిత ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం విక్రయించుకోవచ్చని ఏఓ యశ్వంతరావు, సీఎస్‌డీటీ రామకృష్ణ తెలిపారు. మిల్లుల వద్ద తేమ శాతం చూస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సభ్యులకు సూచించారు. మనబడి మన భవిష్యత్‌లో నిలిచిపోయిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు చేశామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు తెలిపారు. బానాది ప్రభుత్వ పాఠశాలకు రహదారి సౌకర్యం లేదని ఎంపీటీసీ గొంప తులసి అధికారుల దృష్టికి తీసుకురాగా ఎంఈఓ ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. చినగుడిపాల గ్రామంలో నివాసిత ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ సంజీవమెట్ట గ్రామానికి వేయడం వల్ల ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై చనిపోయారని, బాధిత కుటుంబ సభ్యులు దీన స్థితిలో ఉందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు 11 కేవీ విద్యుత్ లైన్ మార్పు చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ స్తంభం పడిపోయి పదిమేకలు మృతి చెందినా నేటికీ పరిహారం ఇవ్వలేదని సర్పంచ్ రామునాయుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పీఎం జన్‌మన్ పథకంలో గదబవలసకు మూడు కోట్లతో సీసీ రోడ్డు మంజూరైందని పీఆర్ ప్రాజెక్టు ఏఈ మానస తెలిపారు. మారిక రోడ్డుకు రూ.3.50 కోట్లు మంజూరైందని, రెండు కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం జనవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. మిగిలిన రహదారికి రూ.7కోట్లతో ప్రతిపాదనలు చేసామని మంజూరు కాగానే నిర్మాణం చేపడతామని తెలిపారు. రూ.90కోట్లతో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో 191 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. వేపాడ మండలంలో రోడ్ల పరిస్థితిపై సభ్యులు ప్రశ్నించగా ఆర్అండ్‌బీ జేఈ స్వామి మాట్లాడుతూ ప్రధాన రహదారి పనులు జనవరిలో ప్రారంభిస్తామని ముందుగా సైడు కాలువలు నిర్మాణం చేపడతామని వివరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ రాములమ్మ, వైస్ ఎంపీపీ ఎ.ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ పాల్గొన్నారు.